సాక్షి
నిజామాబాద్
శనివారం । 28 । జూన్ । 2025

● జగన్నాథా.. జగదానందకారకా..



జగన్నాథ రథాన్ని లాగుతున్న భక్తులు, రథంపై దేవతమూర్తులు (ఇన్‌సెట్‌లో..)

● కనుల పండువగా జగన్నాథ రథయాత్ర ● నగరంలో ఆధ్యాత్మిక శోభ

పూరీ జగన్నాథుని రథయాత్ర కనుల పండువగా కొనసాగింది. సోదరి సుభద్ర, అన్న బలభద్రుడితో నగర పురవీధుల్లో అందరివాడై రథంపై జగన్నాథుడు ఊరేగారు. జై జగన్నాథ నామస్మరణతో శుక్రవారం ఇందూరు నగరం పులకించింది. సాక్షాత్తూ ఆ జగన్నాథుడే జనం మధ్యకు కదిలివచ్చిన అపూర్వ ఘట్టంతో వీధులన్నీ కిక్కిరిసిపోయాయి. ఇస్కాన్ ఇందూరు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రథయాత్రను నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, ప్రముఖ న్యాయవాది కృపాకర్‌రెడ్డిలు ప్రారంభించారు. పాత గంజ్ క్లాక్ టవర్ నుంచి ప్రారంభమైన రథయాత్ర గాంధీచౌక్, శివాజీనగర్, పులాంగ్ చౌరస్తా, హనుమాన్ జంక్షన్ నుంచి తిరిగి పులాంగ్ చౌరస్తా, ఎల్లమ్మగుట్ట, దేవీరోడ్ మీదుగా గంజ్ క్లాక్ టవర్‌కు చేరుకుంది. – నిజామాబాద్ రూరల్

న్యూస్‌రీల్

బస్తీ దవాఖానాలకు కొత్త డాక్టర్లు



నిజామాబాద్ నాగారం: జిల్లా వైద్యారోగ్య శాఖలోని బస్తీ దవాఖానాల్లో ఖాళీగా ఉన్న డాక్టర్ల పోస్టులను కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం భర్తీ చేసినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ బీ రాజశ్రీ తెలిపారు. నాగారం, ఖానాపూర్ బస్తీ దవాఖానలో గతంలో నియామకమైన డాక్టర్లు రాజీనామా చేయగా, కొత్తగా ఏర్పాటైన బోధన్ బస్తీ దవాఖానతో మొత్తం మూడు వైద్యాధికారుల పోస్టులకు ముగ్గురు ఎంబీబీఎస్ అర్హత గల వారిని నియమించినట్లు తెలిపారు. డాక్టర్ రేణి మనీష్ కుమార్(ఖానాపూర్) , డాక్టర్ టీఆర్ శ్రావణలక్ష్మి(బోధన్), డాక్టర్ మహమ్మద్ షాదాబ్ (నాగారం)లకు నియామకపత్రాలు అందజేశామన్నారు.

టూరిజం దేవుడిచ్చిన వరం

● ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి



డొంకేశ్వర్(ఆర్మూర్): కళ్లు చెదిరే ప్రకృతి అందాలతో ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతం టూరిజం స్పాట్‌గా మారిందని, ఇది దేవుడిచ్చిన వరమని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి అన్నారు. ఏడాదికి 30 లక్షల మంది పర్యాటకులు వస్తారని, దీనిని ఉత్తర తెలంగాణలో బెస్ట్ టూరిజం ప్రాంతంగా మారుస్తామని చెప్పారు. శుక్రవారం డొంకేశ్వర్ మండలంలో పర్యటించిన ఆయన చిన్నయానం వద్ద ఏర్పాటు చేయనున్న ఎకో టూరిజం ప్రాంతాన్ని పరిశీలించారు. అటవీశాఖ అధికారులతో ఎకో టూరిజం విషయాలపై చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎకో టూరిజం కోసం రూ.2 కోట్ల వరకు నిధులు కేటాయించిందని, మూడు సఫారీ వాహనాలను కూడా మంజూరు చేసినట్లు తెలిపారు. జలాల్‌పూర్, చిన్నయానం, గాదేపల్లి, ఉమ్మెడ ప్రాంతాలను టూరిజం స్పాట్లుగా గుర్తించామని, సీహెచ్ కొండూరు కూడా పరిశీలనలో ఉందన్నారు. బ్యాక్ వాటర్‌లో పడవల్లో బాసర వరకు వెళ్లి సరస్వతిని దర్శించుకోవచ్చని తెలిపారు. సోమశీలకు కేటాయించినట్లుగా ఆర్మూర్ నియోజకవర్గంలో ఎకో టూరిజానికి కూడా రూ.800 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట ఎఫ్‌ఆర్వో శ్రీనివాస్, డిప్యూటీ ఎఫ్‌ఆర్వో సుధాకర్ ఉన్నారు.

జాతీయస్థాయి స్విమ్మింగ్‌లో గోల్డ్‌మెడల్

● జిల్లా క్రీడాకారిణి మిట్టపల్లి రిత్విక ఘనత




బంగారు పతకం అందుకుంటున్న మిట్టపల్లి రిత్విక

నవీపేట: మండలంలోని బినోల గ్రామానికి చెందిన స్విమ్మింగ్ క్రీడాకారిణి మిట్టపల్లి రిత్విక జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలో బంగారు పతకం సాధించింది. స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లోని బిజూ పట్నాయక్ స్విమ్మింగ్ పూల్ కాంప్లెక్స్(కళింగ స్టేడియం)లో ఈ నెల 22 నుంచి 26 వరకు ఆక్విటిక్ నేషనల్ చాంపియన్‌షిప్ (2025) పోటీలు నిర్వహించారు. అందులో భాగంగా 50 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్‌లో జరిగిన పోరులో 33.98 సెకన్లలో లక్ష్యాన్ని ఛేదించిన రిత్విక బంగారు పతకాన్ని సాధించింది. ఈ సందర్భంగా రిత్వికను పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త అభినందించినట్లు క్రీడాకారిణి తండ్రి మిట్టపల్లి ప్రకాశ్‌రావ్ శుక్రవారం తెలిపారు. రాష్ట్ర స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, కార్యదర్శి ఉమేశ్, జిల్లా ప్రతినిధులు గడీల శ్రీరాములు, శ్యాం సుందర్‌రెడ్డి, వేణుగోపాల్, రాగిణి, శ్రీనివాస్‌లు అభినందించారన్నారు. కాగా, వచ్చే నెల 14 నుంచి జర్మనీలో జరిగే వరల్డ్ యూనివర్సిటీ పోటీలలో ఇండియా నుంచి రిత్విక పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు.

స్థానిక బరిపై గురి

● స్థానిక ఎన్నికల్లో నిలిచేందుకు నాయకులు, శ్రేణుల ప్రణాళికలు
● అభ్యర్థిత్వాల కోసం కీలక నేతల చుట్టూ ప్రదక్షిణలు
● మరోవైపు గ్రామాల్లో విందు సమావేశాలు
● మద్దతు కూడగట్టుకునేందుకు నాయకుల కసరత్తులు
● రిజర్వేషన్లపై ఉత్కంఠగా ఎదురుచూపులు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: స్థానిక సంస్థల్లో అధికారం చేజిక్కించుకునేందుకు గాను ప్రధాన రాజకీయ పార్టీల శ్రేణులు రంగం సిద్ధం చేసుకుంటున్నాయి. పంచాయతీల పాలకవర్గాల పదవీకాలం పూర్తయి ఏడాదిన్నర, పరిషత్‌ల పదవీకాలం ముగిసి ఏడాది కావస్తోంది. మున్సిపాలిటీల పాలకవర్గాల పదవీకాలాలు పూర్తయి ఐదు నెలలు దాటిపోయింది. అన్ని చోట్లా ప్రత్యేక అధికారుల పాలన నడుస్తోంది. దీంతో అభివృద్ధి పనుల విషయంలో సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రజాసమస్యల పరిష్కారం అంతంత మాత్రంగానే ఉంది. కాగా సెప్టెంబర్ 30 లోగా స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేయాలని హైకోర్టు తీర్పునిచ్చింది. దీంతో పల్లెల్లో, పట్టణాల్లో స్థానిక పోరు సందడి నెలకొంది. నిజామాబాద్ నగర పాలక సంస్థలో ఎట్టిపరిస్థితుల్లో పాగా వేసేందుకు బీజేపీ పకడ్బందీగా పావులు కదుపుతోంది. ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణలు విడతలవారీగా సర్వేలు సైతం చేయించారు. అయితే అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఇందూరు నగరపాలకాన్ని చేజిక్కించుకునేందుకు ప్రణాళికలు రచిస్తోంది. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, షబ్బీర్‌అలీలు కసరత్తులు చేస్తున్నారు. ఆర్మూర్, బోధన్, భీంగల్ మున్సిపాలిటీల్లో పాగా వేసేందుకు బీజేపీ, కాంగ్రెస్‌లు నువ్వా నేనా అనేవిధంగా పట్టుదలతో ఉన్నాయి. ఇక జిల్లా ప్రజాపరిషత్, మండల ప్రజా పరిషత్‌లలో, గ్రామ పంచాయతీల్లో సత్తా చాటేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకత్వం పకడ్బందీగా కసరత్తులు చేస్తోంది. బీజేపీ పంచాయతీలు, పరిషత్‌లలో పాగా వేసేందుకు ప్లాన్ చేస్తోంది. త్రిముఖ పోటీలో తమకు కలిసొస్తుందని బీఆర్ఎస్ అంచనాలు వేసుకుంటోంది.

ఎమ్మెల్యేల సుడిగాలి పర్యటనలు షురూ..

ఎమ్మెల్యేలు తాము ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో సాధ్యమైనన్ని ఎక్కువ స్థానాలు గెలిపించుకునేందుకు కసరత్తులు చేస్తున్నారు. ప్రణాళికలు రచిస్తున్నారు. ఇందులో భాగంగా ఆయా ప్రాంతాల్లో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు వరుసగా చేస్తున్నారు. అదేవిధంగా సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్నారు. ఇక సన్నబియ్యం, సన్నధాన్యం బోనస్, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు తమకు కలిసొస్తాయని కాంగ్రెస్ నాయకులు భావిస్తున్నారు. ఇక స్థానిక ఎన్నికలకు ముందు పసుపు బోర్డు కార్యాలయం ప్రారంభోత్సవానికి వస్తున్న అమిత్‌షా రైతు సమ్మేళనం సభలో పాల్గొననుండడంతో తమకు పట్టణాలతో పాటు గ్రామాల్లోనూ తిరుగులేని బలం పెరుగుతుందని బీజేపీ నేతలు లెక్కలు వేసుకుంటున్నారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో, పట్టణాల్లో హడావుడి రోజురోజుకూ పెరుగుతోంది.

రిజర్వేషన్లపై..

సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఉవ్విళ్లూరుతున్న ఆశావహులు రిజర్వేషన్ల ఖరారు కోసం ఎదురు చూస్తున్నారు. రిజర్వేషన్లు తాము ఆశించినవిధంగా వస్తే టిక్కెట్లు దక్కించుకునేందుకు కీలక నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గ్రామాల్లో, పట్టణాల్లోని డివిజన్లలో విందు సమావేశాలు నిర్వహిస్తున్నారు. మద్దతు కూడగట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

డబుల్ ఇంజిన్ సర్కారుతోనే రాష్ట్రాభివృద్ధి



పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

● ఢిల్లీ ఆదేశాలతోనే రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన
● అమిత్ షా సభకు రైతులు తరలిరావాలి
● బీజేపీ అసెంబ్లీ ఫ్లోర్‌లీడర్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి
● రైతు సమ్మేళనం బహిరంగ సభాస్థలి పరిశీలన

సుభాష్‌నగర్: డబుల్ ఇంజిన్ సర్కారుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని బీజేపీ అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఫామ్‌హౌస్ నుంచి పాలన సాగిస్తే.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఢిల్లీ ఆదేశాలతో పాలన కొనసాగిస్తోందని విమర్శించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు నెరవేర్చే వరకూ మెడలు వంచుతామని హెచ్చరించారు. అరెస్టులతో బీజేపీ నాయకులు, కార్యకర్తలను భయపెట్టే పరిస్థితి లేదన్నారు. ఇదే చివరి రైతుభరోసా కాబట్టి కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నాయని ఎద్దేవాచేశారు. ఇందిరాగాంధీ తన పదవిని కాపాడుకోవడానికి దేశంలో ఎమర్జెన్సీని విధించిందని విమర్శించారు. అన్ని పథకాలకు ఇందిరమ్మ పేర్లు పెడుతున్నారని, కాంగ్రెస్‌ది కుటుంబ పాలన అని, గాంధీల పేరుతో కాంగ్రెస్ నేతలు కాలం వెళ్లదీస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లో తిరిగే పరిస్థితి లేదని, రైతు సంబరాలు ఎందుకు చేస్తున్నారో అర్థం కావడంలేదన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాస్వామ్యాన్ని భ్రష్టుపట్టిస్తున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడే ఏకైక పార్టీ బీజేపీ అన్నారు. ఎంపీ అర్వింద్ వల్లే నిజామాబాద్‌లో పసుపుబోర్డు సాధ్యమైందన్నారు. ఈ నెల 29న జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ మైదానంలో నిర్వహించే అమిత్ షా రైతు సమ్మేళన బహిరంగ సభకు రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని మహేశ్వర్‌రెడ్డి కోరారు. అనంతరం పాలిటెక్నికల్ కళాశాల మైదానాన్ని ఎంపీ అర్వింద్ ధర్మపురితో కలిసి పరిశీలించారు. వారి వెంట అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, నాయకులు న్యాలం రాజు, నాగోళ్ల లక్ష్మీనారాయణ, స్రవంతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తారక్ వేణు, మధు, ఇప్పకాయల కిశోర్ తదితరులు ఉన్నారు.

ఎస్సారెస్పీలోకి పెరిగిన ఇన్‌ఫ్లో

బాల్కొండ : స్థానిక ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి వరద నీరు పెరిగింది. ఎగువ ప్రాంతాల నుంచి 4,711 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుత సీజన్‌లో ఇంత నీరు రావడం ఇదే తొలిసారి. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 100, మిషన్ భగీరథ ద్వారా 231, ఆవిరి రూపంలో 286 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091 (80.5 టీఎంసీలు) అడుగులు కాగా శుక్రవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1064.30 (15.14 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

ప్రయివేటు బడుల జబర్దస్తీ



■ ఈ చిత్రంలోని పాఠశాల నగరంలోని ఖిల్లా ప్రాంతంలో కొనసాగుతోంది. ఈ పాఠశాలకు అనుమతి లేదు. ఇటీవల విద్యాశాఖ అధికారులు పరిశీలించి, హెచ్చరించినా యాజమాన్యానికి చీమకుట్టినట్లు కూడా లేదు.

■ ఇది బోధన్ రోడ్‌లో ఉన్న ప్రైమ్ ద స్కూల్. ఇందులో ఉన్నత తరగతులకు అనుమతి లేదని ఎంఈవో నోటీసు జారీ చేశారు. అయినా ఉన్నత తరగతులకు పాఠాలు బోధిస్తున్నారు.



● అనుమతి లేకున్నా కొనసాగింపు
● విద్యాశాఖ నోటీసులను పట్టించుకోని యాజమాన్యాలు
● విద్యార్థుల భవితవ్యంపై ప్రభావం

నిజామాబాద్ అర్బన్: జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల ఆగడాలు శ్రుతిమించుతున్నాయి. కనీస నిబంధనలు పాటించకుండా యాజమాన్యాలు పాఠశాలలను నిర్వహిస్తున్నాయి. ప్రధానంగా కార్పొరేట్, ఐఐటీ, డిజిటల్ విద్యా పేరిట విచ్చలవిడిగా ఫీజులు దండుకుంటున్నారు. విద్యాశాఖ అనుమతి లేకుండానే తరగతులు బోధిస్తున్నారు. సాక్షాత్తు విద్యాశాఖ అధికారులు జారీ చేసిన నోటీసులను బేఖాతరు చేస్తూ యథేచ్ఛగా పాఠశాలలను కొనసాగిస్తున్నారు.

✤ జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ బైపాస్ రోడ్‌లో శ్రీ చైతన్య సీబీఎస్ఈ పేరిట నిర్మాణంలో ఉన్న భవనంలోనే అడ్మిషన్లు చేపట్టి తరగతులు కొనసాగిస్తున్నారు. దీనికి విద్యాశాఖ నుంచి ఎలాంటి అనుమతి లేదు. ఈ పాఠశాలకు అనుమతి లేదని ఎంఈవో పత్రికా ప్రకటనతోపాటు పాఠశాలకు నోటీసులు సైతం జారీ చేశారు. అయినా మరుసటి రోజు నుంచి తరగతుల నిర్వహణ కొనసాగుతోంది.

✤ ఎల్లమ్మగుట్టలోని వెంచర్‌లో కొనసాగుతున్న సీబీఎస్ఈ పాఠశాలకు నేటి వరకూ అనుమతి రాలేదు. నిబంధనలకు విరుద్ధంగా సీబీఎస్ఈ ఇంటర్నేషనల్ పేరిట కొనసాగుతోంది. దీనిపై విద్యాశాఖ కూడా స్పందించకపోవడం గమనార్హం.

✤ బోధన్ రోడ్‌లోని ఓ ప్రైవేటు పాఠశాల ఐదేళ్లుగా ఉన్నత తరగతులకు అనుమతి తీసుకోలేదు. ఇదే ప్రాంతంలో ఉండే మరో పాఠశాల అనుమతిని ఉపయోగించుకొని విద్యార్థులను ఇబ్బందులను గురి చేస్తున్నారు. దీనిపై విద్యాశాఖకు అనేకసార్లు ఫిర్యాదులు వచ్చిన ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

✤ ఆర్మూర్‌లో రెండేళ్లుగా అనుమతి లేకుండానే ఓ ప్రైవేట్ పాఠశాల విద్యా బోధన చేపడుతోంది. విద్యాశాఖకు ఫిర్యాదులు వెళ్లినా నేటి వరకూ చర్యలు తీసుకోలేదు.

✤ నందిపేటలో మరో ప్రైవేట్ పాఠశాల అనుమతి లేకున్నా రెండేళ్లుగా కొనసాగుతోంది. ప్రత్యేక విద్యాబోధన పేరిట భారీగా ఫీజులు దండుకుంటోంది.

78 బడుల్లో 20కి మాత్రమే అనుమతి

జిల్లా విద్యాశాఖ ఈ ఏడాది ప్రైవేట్ పాఠశాలలకు అనుమతుల జారీల్లో కఠినంగా వ్యవహరించింది. కచ్చితంగా నిబంధనలు పాటించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ ఏడాది 78 పాఠశాలలు అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నాయి. వీటిని డీఈవో అశోక్ పూర్తిస్థాయిలో పరిశీలన చేయించారు. ఎంఈవోలతో నివేదికను తెప్పించుకున్నారు. కనీస సౌకర్యాలులేని పాఠశాలలకు అనుమతి నిరాకరించారు. 78 పాఠశాలల్లో కేవలం 20 పాఠశాలలకు మాత్రమే అనుమతులు జారీ చేశారు. కాగా, అనుమతి నిరాకరించిన పాఠశాలలు విద్యాశాఖ ఆదేశాలను పట్టించుకోకుండా ఈ ఏడాది విద్యా బోధన చేపట్టడం గమనార్హం.

నిబంధనలు పాటించాల్సిందే..



ప్రైవేట్ పాఠశాలలు కచ్చితంగా నిబంధనలు పాటించాలి. పాటించని వాటినిపై చర్యలు తీసుకుంటాం. అనుమతి లేని ప్రైవేటు పాఠశాలలను సైతం పరిశీలించి చర్యలు తీసుకుంటాం. విద్యార్థుల తల్లిదండ్రులు అనుమతి ఉందా లేదా అని పరిశీలించిన తర్వాతే పిల్లలను చేర్పించాలి. – అశోక్, జిల్లా విద్యాశాఖ అధికారి

నాణ్యమైన విద్యాబోధనతో ఉత్తమ ఫలితాలు

● కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి
● పదో తరగతి పాసైన ప్రతి విద్యార్థి కళాశాలలో చేరేలా చూడాలి



నిజామాబాద్ అర్బన్ : పదో తరగతి, ఇంటర్ వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు రాబట్టేందుకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఇప్పటి నుంచే మెరుగైన బోధన అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం సాయంత్రం కలెక్టర్ విద్యాశాఖ పనితీరుపై అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, రెసిడెన్షియల్ స్కూల్స్, గురుకులాలు, కేజీబీవీల నిర్వహణ తీరుతెన్నులు, గత సంవత్సరం సాధించిన ఫలితాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు సమీపించిన సమయంలో హడావుడి పడకుండా ఇప్పటి నుండే ప్రణాళికబద్ధంగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధిస్తే అత్యుత్తమ ఫలితాలు వస్తాయని అన్నారు. ఎంఈవో, కాంప్లెక్స్ హెచ్‌ఎంలతో క్రమం తప్పకుండా సమీక్ష జరుపుతూ ప్రభుత్వ బడులలో కార్పొరేట్‌కు దీటుగా విద్యా బోధన జరిగేలా చూడాలని డీఈవో అశోక్‌ను ఆదేశించారు. గణితం, ఆంగ్లం, సామాన్య శాస్త్రం వంటి సబ్జెక్టులలో వెనుకబడి ఉన్న విద్యార్థులను గుర్తిస్తూ వారిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. పదో తరగతి ఉత్తీర్ణులైన ప్రతి విద్యార్థి కళాశాలల్లో చేరేలా పర్యవేక్షణ జరపాలన్నారు. ఒక జత ఏకరూప దుస్తులు విద్యార్థులకు అందించామని, రెండో జత యూనిఫామ్‌లను మహిళా స్వయం సహాయక సంఘాలు త్వరగా కుట్టించి ఇచ్చేలా కృషి చేయాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన మరమ్మతు పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, డీఐఈవో రవికుమార్, డీఈవో అశోక్, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల అధికారులు స్రవంతి, రజనీ, నాగోరావు, రెసిడెన్షియల్ విద్యా సంస్థల ప్రాంతీయ సమన్వయకర్తలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

లభించని అభయహస్తం

● పథకం రద్దు చేసి ఏళ్లు గడుస్తున్నా..
● దరఖాస్తుదారుల ఖాతాల్లోకి చేరని సొమ్ము
● జిల్లా మహిళలకు రావాల్సిన మొత్తం రూ.12.67కోట్లు



'అభయహస్తం పథకం కింద మహిళా సంఘాల సభ్యులు చెల్లించిన సభ్యత్వ సొమ్మును తిరిగి వారి ఖాతాల్లో జమ చేస్తాం.. గత ప్రభుత్వంలా మేము నిర్లక్ష్యం చేయబోము.' – అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి

మోర్తాడ్(బాల్కొండ): అభయహస్తం సొమ్మును మహిళల ఖాతాల్లో తిరిగి జమ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారు. అంతకు ముందే ఎన్నికల మేనిఫెస్టోలో ఈ అంశాన్ని చేర్చి హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కాలం ముగిసిపోయినా ఇప్పటి వరకు అభయహస్తం సొమ్మును దరఖాస్తుదారుల ఖాతాల్లో ఇప్పటికీ జమ కాలేదు. మహిళా సంఘాల్లోని సభ్యులకు 55 ఏళ్ల వయస్సు నిండితే వారికి పింఛన్‌ను అమలు చేసేందుకు ఉమ్మడి రాష్ట్రంలో రూపుదిద్దుకున్న అభయహస్తం పథకాన్ని రద్దు చేసి ఏళ్లు గడుస్తోంది. జిల్లాలోని మహిళలకు సంబంధించి రూ.12,67,69,610 బ్యాంకులోనే మూలుగుతున్నాయి. ఈ సొమ్మును వాపస్ చేసేందుకు రెండేళ్ల కింద మహిళా సంఘాల ప్రతినిధులు అభయహస్తం సభ్యత్వ రుసుం చెల్లించిన మహిళల వివరాలను నమోదు చేసుకున్నారు. అభయహస్తం పథకాన్ని 2017లో నిలిపివేసి అప్పటి నుంచి పింఛన్‌ల పంపిణీని రద్దు చేశారు. అలాగే పింఛన్ అర్హుల సొమ్మును బ్యాంకులోనే ఉంచారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా కొనసాగిస్తున్న మహిళా సంఘాల్లో మెజార్టీ మహిళలు పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందినవారే ఉన్నారు. మహిళల పరిస్థితిని అర్థం చేసుకుని ప్రభుత్వం అభయహస్తం సభ్యత్వ సొమ్మును వారి ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వానికి పలువురు సూచిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

అభయహస్తం పింఛన్ పథకం కింద ఉమ్మడి జిల్లాలో 13,506 మందిని అర్హులుగా గుర్తించి వారితో రూ.3,685 చొప్పున జమ చేయించారు. వారికి ప్రతి నెలా రూ.500 చొప్పున పింఛన్ అందించారు. మరో 40వేల మందిని సభ్యులుగా చేర్చుకుని ప్రతి సంవత్సరం ఒక్కొక్కరితో రూ.385 చొప్పున ఐదేళ్లపాటు రూ.1,925 జమ చేయించారు. అభయహస్తం పథకంలో చేరిన వారికి భవిష్యత్‌లో ఆర్థికంగా లబ్ధి చేకూర్చాలని దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి భావించారు.

క్లుప్తంగా

కొత్త మండలాలకు ఏపీఎంలను నియమించండి

• సెర్ప్ సీఈవోకు డీఆర్డీవో లేఖ

డొంకేశ్వర్: ఐకేపీలో ఉద్యోగ బదిలీలు జరుగుతున్న నేపథ్యంలో జిల్లాలో కొత్తగా ఏర్పడిన మండలాలకు ఏపీఎంలను నియమించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి(డీఆర్డీవో) సాయాగౌడ్ సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్‌ను కోరారు. ఈ మేరకు ప్రత్యేకంగా లేఖ రాశారు. డొంకేశ్వర్, ఆలూరు, పొతంగల్, సాలూర కొత్త మండలాలుగా ఏర్పడి రెండేళ్లయినా ప్రభుత్వం ఏపీఎంలను నియమించలేదు. దీంతో పాత మండలాల ఏపీఎంలే కొత్త మండలాల్లో మహిళా సంఘాల నిర్వహణ, రుణాలు, రికవరీ అంశాలను చూశారు. ఐతే.. మరో రెండు, మూడు రోజుల్లో ఏపీఎంలకు బదిలీలు జరగనున్నాయి. కొత్త మండలాలకు కూడా ఏపీఎంలను ఇస్తే పరిపాలన పరంగా బాగుంటుందని సెర్ప్ సీఈవోకు డీఆర్డీవో వివరించారు.

ఎస్సెస్సీ సప్లిమెంటరీలో 83.44 శాతం ఉత్తీర్ణత

నిజామాబాద్‌అర్బన్: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. జిల్లాలో 815 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 680 మంది ఉత్తీర్ణులయ్యారు. 83.44 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రీకౌంటింగ్ కోసం రూ.500, రీ వెరిఫికేషన్ కోసం రూ.1000 చెల్లించావల్సి ఉంటుందని డీఈవో అశోక్ తెలిపారు.

ఉన్నతంగా విధులు నిర్వర్తించాలి

• జిల్లా జడ్జిని కలిసిన మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ శ్యాంబాబు



నిజామాబాద్ లీగల్: ఉన్నతంగా విధులు నిర్వర్తించి వృత్తికి మంచి పేరు తీసుకు రావాలని జిల్లా జడ్జి జీవియన్ భరతలక్ష్మి అన్నారు. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమితులైన న్యాయవాది ముత్యాల శ్యామ్ బాబు శుక్రవారం జిల్లా జడ్జిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తన ఉత్తర్వు కాపీని జడ్జికి అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాది ఆమిడాల సుదర్శన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయిరెడ్డి, ప్రధాన కార్యదర్శి మాణిక్ రాజు, సీనియర్ న్యాయవాది జె వెంకటేశ్వర్లు ఉన్నారు.



పూజల అనంతరం హారతి ఇస్తున్న పూజారులు



ఊరేగింపులో నృత్యాలు చేస్తున్న భక్తులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే, మార్కెట్ కమిటీ చైర్మన్

హిందూ ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత

• ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ
• వైభవంగా జగన్నాథ రథయాత్ర
• పెద్ద సంఖ్యలో హాజరైన భక్తజనం



జగన్నాథ రథయాత్రలో పాల్గొన్న భక్తులు

నిజామాబాద్ రూరల్: హిందూ ధర్మాన్ని పరిరక్షించుకునే బాధ్యత అందరిపై ఉందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ నిర్మలమైన మనస్సుతో భగవంతున్ని ప్రార్థించాలని తెలిపారు. అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఇందూరు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో నిర్వహించిన జగన్నాథ రథయాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇస్కాన్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ తత్వాన్ని, మహాభగవత్ సమస్త మానవాళి జీవనానికి గల ప్రాముఖ్యతను వారం రోజులుగా భక్తులకు సప్తాహం ద్వారా తెలియజేశారన్నారు. శ్రీకృష్ణుడు సకల శుభాలను అందించి భక్తుల కష్టాలను తీరుస్తాడని తెలిపారు. రథయాత్రలో స్వామిని దర్శించుకోవడం, రథసేవ చేయడం మహాభాగ్యమన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఇస్కాన్ వారు జగన్నాథ రథయాత్ర నిర్వహించడం సంతోషకరమన్నారు. ప్రజలకు భగవంతుని పట్ల విశ్వాసం పెరిగేలా ఇస్కాన్ ప్రతినిధులు ప్రవచనాలు అందించారని అన్నారు. కాగా, ఇస్కాన్ ముంబై ఉపాధ్యక్షుడు, ఇస్కాన్ గ్రంథ తెలుగు అనువాదకులు శ్రీమాన్ వైష్ణవాంగ్రి సేవక్ దాస్ ఆధ్వర్యంలో కేంద్రం అధ్యక్షుడు బలరాం దాస్ ఎనిమిది రోజులపాటు పాత గంజ్‌లో జగన్నాథ రథయాత్ర కార్యక్రమంలో ప్రవచనాలు చేశారు. రథయాత్రకు ముందు భజనలు, కీర్తనలు, మహాహారతి, పల్లకీ సేవ, ఊంజల్ సేవ, సాంస్కృతిక కార్యక్రమాలతో గంజ్ ప్రాంతంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఊరేగింపులో జిల్లా నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణాలు ఇలా.. ఆటలాడేదెలా!



ముల్లంగిలో చెట్లపొదలతో ఉన్న క్రీడా ప్రాంగణం



చిక్లిలో క్రీడామైదానంలో ఉన్న పైపులు



మాక్లూర్: మెట్‌పల్లిలో పొలాలకు వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణం బోర్డు

గ్రామీణ ప్రాంతాల్లో ఉండే క్రీడాకారులను వెలికి తీసేందుకు గత ప్రభుత్వం అన్ని గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. క్రీడాకారులకు తగిన సౌకర్యాలు కల్పించింది. ప్రస్తుతం వీటి నిర్వహణ గాలికి వదిలేయడంతో పలు గ్రామాల్లోని క్రీడా ప్రాంగణాలు చెట్లపొదలతో నిండిపోయాయి. చెత్తాచెదారాలకు నిలయాలుగా, కొన్ని చోట్ల క్రీడాప్రాంగణాలు బోర్డులు మాత్రమే దర్శనమిస్తున్నాయి. అధికారులు స్పందించి, వసతులు కల్పించి క్రీడాకారులను ప్రోత్సహించాలని గ్రామస్తులు, యువకులు కోరుతున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫోటోగ్రాఫర్ – నిజామాబాద్

బ్లాక్‌లాగ్ పరీక్షలు నిర్వహించండి



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పీజీ బ్యాక్‌లాగ్ పరీక్షలను నిర్వహించాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తెయూ కంట్రోలర్ సంపత్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ అమృతాచారి, వర్సిటీ అధ్యక్షుడు సాయికుమార్ మాట్లాడుతూ.. వచ్చే సెమిస్టర్ పరీక్షల సమయంలో వర్సిటీ విద్యార్థులకు రెగ్యులర్ పరీక్షలతో పాటు బ్లాక్‌లాగ్ పరీక్షలను నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో వర్సిటీ ఏబీవీపీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ అక్షయ్, నాయకులు పృథ్వీ, మనోజ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పోచంపాడే.. శ్రీరాంసాగర్



శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్



కోదండ రామాలయం

మీకు తెలుసా?

మెండోరా మండలంలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టును ముందు పోచంపాడ్ ప్రాజెక్టుగా పిలిచేవారు.

• 1978లో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ సందర్శనకు వచ్చిన నాటి ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి పోచంపాడ్‌ను శ్రీరాంసాగర్‌గా పేరు మార్చారు.
• పోచంపాడ్‌లో విధులు నిర్వర్తించే ఉద్యోగులు పోచంపాడ్‌ను పాడ్ అనడం బాగుండదని సీఎంకు విన్నవించడంతో పేరు మార్పు జరిగింది.
• పోచంపాడ్‌లో గోదావరి తీరాన కోదండ రామాలయం ఉండటంతో ఆ ఆలయం పేరు మీదుగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టుగా పేరు మార్చారు.
• పోచంపాడ్ ప్రాజెక్టుకు 1963లో నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ శంకుస్థాపన చేయగా 1978లో పూర్తయింది.
• శ్రీరాంసాగర్ ప్రధాన కాలువలకు కూడా అప్పుడే కాకతీయ, లక్ష్మి, సరస్వతి కాలువలకు నామకరణం చేశారు.

– బాల్కొండ

పసుపు రైతులు సంబురాలు చేసుకోవాలి



మాట్లాడుతున్న కోటపాటి నరసింహ నాయుడు

ఆర్మూర్: జిల్లా కేంద్రంలో జాతీయ పసుపు బోర్డు కేంద్ర కార్యాలయాన్ని ప్రారంభించడానికి వస్తున్న కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా బహిరంగ సభను విజయవంతం చేసి రైతులు సంబురాలు చేసుకోవాలని పసుపు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోటపాటి నరసింహనాయుడు అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని రైతు సేవా కేంద్రంలో శుక్రవారం బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు పాటూరి తిరుపతిరెడ్డితో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 29న జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో నిర్వహించే పసుపు రైతుల సమ్మేళనాన్ని గొప్పగా జరుపుకోవాలన్నారు. ఆర్మూర్ సబ్ డివిజన్‌లోని 250 పసుపు రైతు సంఘాల సభ్యులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు ఖాళీ కావడం ఖాయం

• ఎంపీ ధర్మపురి అర్వింద్



బీజేపీ పార్టీలో చేరుతున్న భూమేశ్వర్‌ను ఆహ్వానిస్తున్న ఎంపీ అర్వింద్

బాల్కొండ: స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ఖాళీ కావడం ఖాయమని ఎంపీ ధర్మపురి అర్వింద్ పేర్కొన్నారు. బాల్కొండ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. బీజేపీలోకి పదవులు ఆశించి రావొద్దని, కేవలం సేవ చేయాలనే భావనతో రావాలన్నారు. బీజేపీలోకి చేరికలు తప్ప బయటకు పోయే పరిస్థితి ఉండదన్నారు. గతంలో నిజామాబాద్ కార్పొరేషన్‌లో బీజేపీ టికెట్‌పై గెలిచిన 10 మంది కార్పొరేటర్లు వేరే పార్టీకి వెళ్లి తిరిగి మళ్లీ బీజేపీలో 14 మందితో చేరారన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించే కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సభకు భారీగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్, నియోజకవర్గ కన్వీనర్ మల్కన్నగారి మోహన్, బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల అధ్యక్షులు అంబటి నవీన్, సంతోష్‌రెడ్డి, ముత్యంరెడ్డి పాల్గొన్నారు.

బీజేపీలో భారీగా చేరికలు..

బీజేపీలో బీఆర్‌ఎస్ నుంచి ఎంపీ అర్వింద్ సమక్షంలో భారీగా చేరికలు జరిగాయి. ముప్కాల్ మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్, బాల్కొండ మాజీ ఎంపీపీ లావణ్యాలింగాగౌడ్, కొత్తపల్లి మాజీ ఎంపీటీసీ వెంకట్‌రాజ్, ముప్కాల్ మాజీ ఉపసర్పంచ్ సువర్ణలింగం, రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి సుంకం శ్రీనివాస్ తమ అనుచరులతో కలిసి బీజేపీలో చేరారు. వారికి ఎంపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

స్వచ్ఛమైన కల్లును అందించాలి

• జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి



రాంపూర్ శివారులో గీత కార్మికులతో మాట్లాడుతున్న మల్లారెడ్డి

రుద్రూర్: గీత వృత్తి కార్మికులు స్వచ్ఛమైన కల్లును అందించాలని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి అన్నారు. కోటగిరి మండలం రాంపూర్ శివారులో గతంలో నాటిన ఈత వనాలను శుక్రవారం పరిశీలించారు. హరితహారం ద్వారా నాటిన ఈత మొక్కలను శ్రద్ధగా పెంచడం వల్లే నేడు స్వచ్ఛమైన కల్లు తీయడానికి సిద్ధంగా ఉన్నాయని గీత కార్మికులు అధికారికి వివరించారు. ఐదేళ్ల క్రితం ఈత వనం పెంపకానికి నాటి ప్రభుత్వం ఐదెకరాల భూమి కేటాయించింది. ఈ భూమిలో సుమారు ఐదు వేల మొక్కలు నాటి పెంపకం చేపట్టారు. ఈతవనం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఆరువేల కుటుంబాలు ప్రత్యక్షంగా, 40వేల కుటుంబాలు పరోక్షంగా గీత వృత్తిపై ఆధారపడి జీవనాన్ని కొనసాగిస్తున్నాయన్నారు. కల్తీ కల్లును అరికట్టేందుకు గత ప్రభుత్వ హాయంలో జిల్లాలో ఈత, ఖర్జురా మొక్కలను ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నాటగా ప్రస్తుతం అరవై శాతం పెరిగి కల్లు అందించేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. వచ్చే నెల 1న వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఈత, ఖర్జూర మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కల్తీ కల్లును అరికట్టేందుకు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో తనిఖీలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. డీటీఎఫ్ సీఐ విలాస్ కుమార్, ఎక్సైజ్ సీఐ భాస్కర్‌రావు, ఎస్సై జమీల్, ఎ విఠల్ గౌడ్, శంకర్ గౌడ్, అరుణ్ గౌడ్, శ్రీధర్ గౌడ్, గౌడ సంఘం నాయకులు, గీత కార్మికులు పాల్గొన్నారు.

సొసైటీ అవినీతిపరులపై చర్యలు తీసుకోవాలి

మాక్లూర్: మాక్లూర్ సొసైటీలో అవినీతి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మాజీ డైరెక్టర్ గంగోనె గంగాధర్ రాష్ట్ర వ్యవసాయ సహకార కమిషనర్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. సొసైటీ పాలకవర్గంలోని కొందరు సభ్యులు, సిబ్బంది, మాజీ సీఈవోలు కలిపి రూ. 5 కోట్లకు పైగా నిధులు దుర్వినియోగమైనట్లు అధికారులు గుర్తించారు. అధికారుల ఎంక్వైరీ నివేదిక మేరకు సంఘం నిధులు దుర్వినియోగం చేసిన వారిని తొలగించి, దుర్వినియెగం చేసిన సొమ్మును రాబట్టాలని కోరారు.

క్రైం కార్నర్

ఇద్దరి మధ్య ఘర్షణ.. ఒకరి మృతి

మోర్తాడ్: మద్యం సేవిస్తూ ఇద్దరు వ్యక్తులు ఘర్షణ పడగా తీవ్ర గాయాలపాలైన ఒకరు మృతి చెందిన ఘటన మోర్తాడ్ మండలం దొన్కల్‌లో చోటు చేసుకుంది. జిల్లా కేంద్రంలోని నందిగుట్టకు చెందిన షేక్ రహమాన్(42) అనే వ్యక్తి లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అలాగే ఇంటి నిర్మాణ కార్మికునిగా కూడా పని చేస్తున్న అతను నాలుగు రోజుల క్రితం అల్లెపు రాజు అనే వ్యక్తితో దొన్కల్‌లో పని చేయడానికి వచ్చాడు. ఇక్కడ పని చేస్తున్న రాజు, రహమాన్‌లు గురువారం అర్ధరాత్రి మద్యం సేవించారు. ఇద్దరి మధ్య వివాదం తలెత్తగా రాజు రహమాన్‌పై దాడి చేశాడు. ఈ దాడిలో రహమాన్ తల, కాళ్లు, చేతులపై తీవ్ర గాయాలయ్యాయి. అపస్మారక స్థితిలో ఉన్న బాధితుడిని ముత్యం అనే వ్యక్తి అంబులెన్స్‌లో శుక్రవారం ఆర్మూర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న భీమ్‌గల్ సీఐ పొన్నం సత్యనారాయణ, మోర్తాడ్ ఎస్సై విక్రమ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మద్యం మత్తులో కాలువలో పడి ఒకరి మృతి

బీబీపేట: మద్యం మత్తులో కాలువలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బీబీపేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రభాకర్ శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. బీబీపేటకు చెందిన శ్యాగ గణేశ్(45) మద్యానికి బానిస కావడంతో ఎలాంటి పనిచేయకుండా తిరుగుతుండేవాడు. మద్యం తాగుతూ బస్టాండ్ ఆవరణలో పడుకునేవాడు. గురువారం రాత్రి మద్యం తాగి స్థానిక వైన్స్ షాప్ దగ్గర ఉన్న మురికి కాలువ వద్ద పడుకున్నాడు. ప్రమాదవశాత్తు మురికి కాలువలో పడి మృతిచెందాడు. మృతుడి భార్య భార్య నర్సవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఐదుగురికి జైలు

ఖలీల్‌వాడి: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఐదుగురికి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ రెండు రోజుల జైలు శిక్షను విధించినట్లు ట్రాఫిక్ సీఐ పి ప్రసాద్ శుక్రవారం తెలిపారు. జిల్లా కేంద్రంలో మద్యం తాగి వాహనాలు నడిపిన 15 మందిని ట్రాఫిక్ పోలీసులు పట్టుకున్నారు. వీరికి ట్రాఫిక్ పీఎస్‌లో కౌన్సెలింగ్ నిర్వహించి కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. పది మందికి రూ. పదివేను వేల జరిమానా, ఐదుగురికి రెండు రోజుల జైలు శిక్షను జడ్జి విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

పోలీసుల అదుపులో ఇద్దరు ఆకతాయిలు

ఖలీల్‌వాడి: నగరంలోని రెండవ టౌన్ పీఎస్‌లో పరిధిలోని ఉన్న దర్గా వద్ద ఇద్దరు ఆకతాయి యువకులను షీటీం సభ్యులు అదుపులోకి తీసుకున్నారు. వీరిని షీటీమ్ సభ్యులు స్థానిక పీఎస్‌కు తరలించారు. విచారణ చేపట్టి వీరిపై కేసు నమోదు చేయనున్నట్లు సమాచారం.

బాత్‌రూమ్ విషయంలో గొడవ



రామారెడ్డి: బాత్‌రూమ్ విషయంలో ఇద్దరు అన్నాదమ్ముళ్లు, వారి కుమారుల మధ్య జరిగిన గొడవలో పలువురు గాయపడినట్లు ఎస్సై రాజారాం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. రామారెడ్డి మండలం మద్దికుంట గ్రామానికి చెందిన నర్సయ్య, రాజయ్య ఇద్దరు అన్నాదమ్ముళ్లు. కాగా వీరికి చెందిన బాత్‌రూం విషయంలో గొడవ జరుగుతోంది. శుక్రవారం వారి మధ్య మళ్లీ గొడవ చోటు చేసుకుంది. మొదట రాజయ్యను తన అన్న నర్సయ్య కుమారుడు శ్రీకాంత్ గొడ్డలితో గాయపర్చాడు. ఆ తర్వాత చిన్న కుమారుడు శ్రీధర్ సైతం రాజయ్యను అతని కుమారుడు నరేశ్‌పై దాడి చేశాడు. దీంతో ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. గాయపడ్డ వారిని ఆస్పత్రికి తరలించారు. పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇజ్రాయిల్ వీసాల పేరిట మోసం

• మూడు జిల్లాల నిరుద్యోగులకు టోకరా
• ఒక్కో వ్యక్తి నుంచి రూ. లక్ష చొప్పున వసూలు
• వీసాలు, పాస్‌పోర్టు ఇవ్వకుండా ఇబ్బందిపెడుతున్న ఏజెంట్
• 50 మందికి పైగా బాధితులు

మోర్తాడ్(బాల్కొండ): 'ఇజ్రాయెల్‌లో ఉద్యోగం.. రూ. లక్షల జీతం ఉంటుంది' అని ఒక్కో నిరుద్యోగి నుంచి రూ. లక్ష చొప్పున వసూలు చేసి టోకరా ఇచ్చాడో గల్ఫ్ ఏజెంట్. ఏడాది కాలంగా వీసాలు ఇవ్వకుండా, పాస్‌పోర్టులు సైతం తనవద్దనే దాచుకొని వలస వెళ్లాలనుకునే వారిని వంచిస్తున్నాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి కేంద్రంగా ట్రావెల్స్ నడిపిస్తున్న ఓ వ్యక్తి నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్ జిల్లాలకు చెందిన 50 మందికి పైగా నిరుద్యోగుల నుంచి భారీ మొత్తంలో వసూలు చేశాడని సమాచారం. ఇజ్రాయెల్‌లో ఉపాధి లభిస్తే తక్కువ సమయంలో ఎక్కువ మొత్తం సంపాదించుకోవచ్చనే ఆశతో ఉన్న నిరుద్యోగులకు ఎరవేసిన ఏజెంట్ ఒక్కో వీసాకు రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకూ ఖర్చు అవుతుందని నమ్మించాడు. ప్రతి నెలా రూ.3 లక్షల వరకూ సంపాదించుకోవచ్చని నిరుద్యోగులకు ఆశ చూపాడు. గల్ఫ్ దేశాల కంటే ఇజ్రాయెల్‌లో ఉపాధి బాగుందని అనేక మంది చెబుతుండటంతో ఏజెంట్‌ను నిరుద్యోగులు నమ్మి మోసపోయారు. వీసాలు చేతికి అందక, తమ డబ్బులు అతని వద్దనే ఉండిపోయాయని, పాస్‌పోర్టులు సైతం ఇవ్వకుండా ఏజెంట్ సతాయిస్తుండడంతో దిక్కుతోచకుండా ఉన్నామని బాధితులు వాపోతున్నారు. ట్రావెల్స్ కార్యాలయానికి వెళితే అక్కడ ఉన్న ఉద్యోగులు ఏదో సాకు చెబుతూ దాటవేస్తున్నారని ఇబ్రాన్‌పల్లి మండలం మునిపల్లికి చెందిన బాధితుడు ఒకరు 'సాక్షి'కి చెప్పారు. తాము ఫోన్ చేస్తే ఏజెంట్ లిఫ్ట్ చేయడం లేదని, ట్రావెల్స్ కార్యాలయంలోని సిబ్బందిని వాకబు చేస్తే తాము సమాచారం ఇస్తామని చెబుతున్నారు తప్పా మరో అనుకూలమైన సమాధానం రావడం లేదని బాధితులు వాపోతున్నారు. ఒకవైపు ఇజ్రాయెల్‌లో శాంతియుత వాతావరణం దెబ్బతినగా అక్కడికే తరలిస్తామని ఏజెంట్లు మాత్రం నిరుద్యోగుల నుంచి అందినకాడికి దోచుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీసులు స్పందించి మోసగిస్తున్న ఏజెంట్ల ఆట కట్టించాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆరేళ్ల బాలుడి మృతి

• మేడ్చల్ జిల్లా దుండిగల్‌లో ఘటన



రాజు(ఫైల్)

నిజామాబాద్ రూరల్: మేడ్చల్ జిల్లా దుండిగల్‌లో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రూరల్ మండలం కేశాపూర్‌కు చెందిన ఓ బాలుడు మృతి చెందాడు. బాలుడి పై నుంచి టిప్పర్ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. రూరల్ మండలం కేశాపూర్‌కు చెందిన గుడిపల్లి రాజ్‌కుమార్ నిహారిక భార్యాభర్తలు. వీరు మేడ్చల్ జిల్లా దుండిగల్ పరిధి మల్లంపేట్‌లో గత ఆరేళ్లుగా నివాసం ఉంటున్నారు. వీరికి అభిమాన్యు(6) కుమారుడు, ఓ పాప ఉన్నారు. స్థానిక గీతాంజలి పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నారు. రోజు మాదిరిగానే శుక్రవారం ఉదయం తన తల్లి నిహారికతో కలిసి ఇంటి నుంచి స్కూటీపై పాఠశాలకు బయలుదేరాడు. మార్గమధ్యలో పల్లవి స్కూల్ జంక్షన్ దగ్గరికి రాగానే వెనుక నుంచి వచ్చిన టిప్పర్ స్కూటీని తాకింది. దీంతో బాలుడు స్కూటీపై నుంచి టిప్పర్ చక్రాల కిందపడిపోయాడు. ఈ ఘటనలో బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. రెప్పపాటు కాలంలో జరిగిన ప్రమాదంలో కుమారుడిని కోల్పోయనంటూ ఆ తల్లి కన్నీరుమున్నీరయ్యింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులు స్వగ్రామమైన కేశాపూర్‌లో సాయంత్రం బాలుడి అంత్యక్రియలు నిర్వహించారు. బాలుడి తల్లితండ్రులు రోదించిన తీరు గ్రామస్తులను కంటతడి పెట్టించింది. బాలుడి మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలు



గాయాలైన చిన్నారి

గాంధారి: పిచ్చికుక్క దాడిలో పలువురు గాయాలపాలైన ఘటన గాంధారి మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఓ చిన్నారి తలకు తీవ్ర గాయాలయ్యాయి. మండల కేంద్రంలోని ఎనిమిదో వార్డులో పిచ్చి కుక్క వీధుల్లో తిరుగుతూ కనబడిన వారందరిపై దాడి చేసి గాయపర్చింది. అమల, అమిక, పాపవ్వ, అనితతో పాటు ఇంటి బయట ఆడుకుంటున్న అమిక అనే చిన్నారిని గాయపర్చింది. పక్కింట్లో ఉండే పాపవ్వ అనే మహిళ కుక్క నుంచి చిన్నారిని విడిపించే ప్రయత్నం చేయగా ఆమెపై కూడా దాడి చేసింది. కుక్కకాటుకు గురైన వారందరిని స్థానికులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా డాక్టర్ ప్రసన్న చికిత్స చేశారు. మెరుగైన చికిత్స కోసం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అంతేకాకుండా పిచ్చి కుక్క పశువులు, దూడలపై దాడి చేసి గాయపర్చింది. కాలనీ వాసులు వెంబడించి పిచ్చికుక్కను చంపేశారు.

హోంగార్డ్స్‌కు ఉలెన్ జాకెట్స్ అందజేత



ఖలీల్‌వాడి: నగరంలోని సీపీ కార్యాలయంలో హోంగార్డులకు సీపీ సాయిచైతన్య ఉలెన్ జాకెట్స్‌ను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. వర్షాకాలం, చలికాలంలో విధుల నిర్వహణ కష్టమవుతున్నందున ముందు జాగ్రత్తలో భాగంగా జిల్లాలోని 369 మంది హోంగార్డ్స్‌కు ఉలెన్ జాకెట్స్‌ను అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హోంగార్డ్స్ విభాగం ఇన్‌చార్జి రిజర్వ్ సీఐ సతీశ్, వెల్ఫేర్ విభాగం రిజర్వ్ సీఐ తిరుపతి, హోంగార్డులు తదితరులు ఉన్నారు.

'ఖిల్లా'ను సందర్శించిన దాశరథి శతజయంతి కమిటీ



నిజామాబాద్ రూరల్: నగరంలోని ఖిల్లా రఘునాథ రామాలయాన్ని దాశరథి శతజయంతి కమిటీ సభ్యులు సాయికుమార్, లింగం, సీతయ్య, నర్సారెడ్డిలు శుక్రవారం సందర్శించారు. ఖిల్లాలోని దాశరథి కృష్ణమాచార్యులను బంధించిన జైలు గదిని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఖిల్లాను దాశరథి స్మృతి వనంగా మార్చాలని, భావితరాలకు దాశరథి పోరాట పటిమ గుర్తుండిపోయేలా తీర్చిదిద్దాలని కోరారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ



సిరికొండ: జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో నారాయణపల్లె గ్రామానికి చెందిన చాట్‌పల్లి నేహ ప్రతిభ చాటినట్లు ఆమె తండ్రి శ్రీనివాస్ తెలిపారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి బాలయోగి ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో నేహ ప్రతిభ చాటి బంగారు పతకం సాధించింది. జిల్లా కేంద్రంలోని నిశిత డిగ్రీ కళాశాలలో నేహ ఫైనల్ ఇయర్ చదువుతోంది.